కథ

# స్నేహితుడా...

**“నీకు ముప్ఫై అయిదేళ్లంటే నమ్మకం కలగడం లేదు. రోజురోజుకీ చాలా గ్లామర్‌గా కనిపిస్తున్నావ్!” వస్తూనే మణి అన్న మాటలకు నవ్వి ఊరుకున్నాను. “ఏంటి మాట్లాడవ్! ఈ రోజు టిఫిన్ ఏంటో అదన్నా చెబుతావా!” అంటూ నన్ను దాటుకుని కిచెన్‌లోకి వెళ్లి వెతుకుతుంటే నిజంగానే నవ్వు ఆగలేదు నాకు.**

''ఏంటి...వేళాకోళమా!'' అన్నాడు సీరియస్‌గా చూస్తూ.

''అలాంటిదేమీ లేదు కానీ... ప్రతీరోజూ నన్నెందుకిలా హింసిస్తావు చెప్పు. నీకు నీ ఇల్లుంది. పిల్లలున్నారు. నీకు వండి పెట్టటానికి నీ భార్య ఉంది. నాకిదంతా బాగా లేదు'' అన్నాను కాస్త గట్టిగా!

ఈసారతను గట్టిగానే నవ్వాడు. ''నూట ఒకటోసారి ఇలా నువ్వు అనటం, నేను వినడం. సరేగానీ టిఫిన్ త్వరగా పెట్టు. నేను వెళ్లాలి!'' అన్నాడు మణి.

''సరే... ఈ పేపర్ చదువు. నువ్వు కారు కొంటానన్నావ్ కదా! ఈ పేపర్లో బోలెడన్ని ఆఫర్లు ఉన్నాయి. స్టార్టింగ్ ప్రైస్ జస్ట్ నాలుగు లక్షల తొంబై తొమ్మిది వేలేనట. ఫ్రీగా చాలా ఇస్తారు. వెంటనే బుక్ చేసుకో!'' అంటూనే కిచెన్ వైపు వెళ్లాను.

టిఫిన్ తిన్నాక మణి వెళ్తూ వెళ్తూ... ''నీతో జీవితాన్ని పంచుకోలేకపోవటం అతని దురదృష్టం. నువ్వు ఏ వయసులోనైనా ఇలాగే ఆనందంగా ఉండాలి. నా స్నేహమే కాదు ప్రతి ఒక్కరిలోనూ స్నేహమాధుర్యాన్ని కోరుకునే వ్యక్తిత్వం నీది!'' అన్నాడు నా వైపు అభిమానంగా చూస్తూ!

అనుకోకుండా అతను టాపిక్ మార్చేసరికి నా మనసు బరువుగా మారింది. మణి ఓ తమిళియన్. ఓ కార్పొరేట్ బ్యాంకులో నాతో పాటు పన్జేస్తున్నాడు. అంత ఉన్నతమైన కారెక్టర్ ఎవ్వరిలోనూ నేను ఇంతవరకు చూడలేదు. నేను ఉంటున్న కాలనీలోనే ఉంటూ, నెలలో కనీసం ఇరవై రోజులన్నా ఉదయమే నన్ను పలకరించకుండా ఉండడు. నేనూ మణి ఇంటికి వెళుతూ ఉంటాను. అతని భార్య కూడా సరదా మనిషి. వచ్చీ రాని తెలుగులో నవ్విస్తూ ఉంటుంది.

మణి వెళ్లిన కాసేపటి వరకూ నా ఆలోచనలు అతని చుట్టూనే ఉన్నాయి. అతనెప్పుడూ నా సమస్యను ఎత్తిచూపకపోవడం అతనిలో ఉన్న గొప్ప గుణం. అతనెన్నోసార్లు నా ఒంటరితనం చుట్టూ స్నేహమనే బంధాన్ని పెంచి నన్ను నేను మర్చిపోయేలా చేశాడు. నువ్వు నీ వయసును దాటి ముందుకే వెళ్లు. వెనక్కి మాత్రం వెళ్లకు అనేవాడు. లోతైన ఆ మాటలు నిజంగానే నాలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. జీవితం పట్ల ఆశ పెరిగింది. నా చుట్టూ ఎవరున్నారు? అన్న ఆలోచనకు స్వస్తి చెప్పాక నా చుట్టూ ఉన్న వాళ్లంతా నా వాళ్లే అన్న భావన కలిగింది. నిజంగానే గ్రేట్ ఫీలింగ్ అది.

మరికొంతసేపు మణి ఆలోచనల్లోనే ఉండిపోయాను. నెమ్మదిగా నా ఆలోచనలు గతం వైపు మళ్లాయి. ఎంత ఆపుదామన్నా ఆగని గతం. వెళ్లకూడదనుకుంటూనే లొంగిపోయాను.

★ ★ ★

నేను ఊహించని రోజది. మా ఇంటికొచ్చాడో వ్యక్తి. అతన్ని చూశాక నాకెందుకో అనుమానంగానే అనిపించింది. అతనేం చెప్పాడో మా అమ్మ, నాన్న ఎగిరి గంతేశారు. మంచి సంబంధం అంటూ తేల్చేశారు. నన్ను పిలిచి ''అతను మనకు తెలిసిన వాళ్ల అబ్బాయ్. నిన్ను మొన్న జరిగిన నా చెల్లెలు కూతురు పెళ్లిలో చూశాడట. మన కులం వాడే. దూరపు బంధుత్వం కూడా ఉంది. పైగా వాళ్లకు పూర్వీకుల నుంచి వచ్చిన ఆస్తిపాస్తులు చాలా ఉన్నాయి'' అంటూ పెద్ద చిట్టా విప్పారు. నాకు మాట్లాడే ఛాన్సు ఇస్తేగా! అతనక్కడే ఉన్నాడు. నేనేం మాట్లాడాలి? అసహనంగా ఉన్నా పైకి కనిపించకుండా అతనున్న హాలులోకి వెళ్లాను.

నన్ను చూస్తూనే ''హాయ్ భాను ఎలా ఉన్నావ్!'' అన్నాడు ఎంతో పరిచయం ఉన్నవాడిలా. నేను గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయాను. నా భావాలు గ్రహించాడేమో మళ్లీ అతనే... ''నా పేరు ప్రసాద్. ఇలా కూర్చోండి'' అన్నాడు గౌరవాన్ని ప్రదర్శిస్తూ!

అతనలా మాట్లాడతాడని ఊహించని నేను అతన్ని సరిగ్గా చూడకుండానే నా గదిలోకి వెళ్లిపోయాను. ఆ తర్వాత అన్ని పనులు నా ప్రమేయం లేకుండానే జరిగిపోయాయి. ఆర్నెల్లు తిరగకుండానే అతన్తో నా పెళ్లి జరిగిపోయింది.

పెళ్లయ్యాక జీవితం కొత్తగా ఉండాలి కదా! అలా లేదేంటి? ఎందుకో అలా అనిపించింది నాకు. అతను ఓ మొబైల్ కంపెనీకి ఏరియా మేనేజర్. విచిత్రంగా మా మధ్య రోజులన్నీ మొబైల్ కాల్స్‌లా ఫాస్ట్‌గా జరిగిపోతూనే ఉండేవి. అతనెప్పుడూ కస్టమర్స్, కంపెనీ లావాదేవీలు అంటూ మాట్లాడేవాడు. పొద్దున్నే వెళ్లి ఏ రాత్రికో వచ్చి కూడా అవే ఆలోచనలతో గడిపేవాడు. ఎప్పుడూ ఫోన్ మాట్లాడుతూ తనేదో గొప్ప ప్రొఫెషన్‌లా ఉన్నట్టు ప్రవర్తించేవాడు. నా ఫీలింగ్స్‌ను అతను పట్టించుకోకుండా ఉంటే ఎలా? నేనేమీ అతని మొబైల్ కంపెనీలో ఓ మొబైల్ ఫోన్‌ని కాదు కదా! ఆ విషయాన్నే అడిగేశాను. అతనేమీ పెద్దగా స్పందించలేదు సరి కదా! ''మంచి ఇల్లు, సౌకర్యాలు ఉన్నాయి కదా! అంతకన్నా నీకేం కావాలి?'' అన్నాడు.


''నన్ను కోరి పెళ్లి చేసుకుంది అందుకేనా? నన్ను బొమ్మను చేసి ఇంట్లో ప్రతిష్ఠించాలనా''? అడిగాను ఉక్రోషంగా!

''మరేం చేయాలి? నాదెంత బిజీ షెడ్యూలో నీకు తెలీదా! కంపెనీలో నాకంటూ ఓ గుర్తింపు ఉంది తెలుసా!'' అన్నాడు. అతన్తో ఆర్గ్యుమెంట్ అనవసరమని ఊరుకున్నాను.

అలా రోజులు, నెలలు గడిచిపోయాయి. ఎం.సి.ఏ. చదువును మధ్యలో ఆపేసి పెళ్లి చేసినందుకు అమ్మా నాన్నల మీద కోపం వచ్చినా నా సమస్య వాళ్లతో చెప్పలేదు. జీవితం బాగా లేనప్పుడు చదువొక్కటే మందు అన్న ఇంగ్లీషు సామెత గుర్తొచ్చి నా ఎం.సి.ఏ. తిరిగి పూర్తి చేయాలని నిర్ణయించాను. లైఫ్‌లో భావోద్వేగాలు చాలా అవసరం. వాటిని కోల్పోయే దశ నుండి నెమ్మదిగా బయటపడ్డాను.

అతనోరోజు బాగా రాత్రయ్యాక ఇంటికొచ్చాడు. తాగుతాడని తెలుసు. ఎందుకో ఆ రోజు ఎక్కువ తాగాడనిపించింది. ఆ మాటే అడిగాను. ''నా ఇష్టం'' అన్నాడు. నేను ఎం.సి.ఏ. పూర్తి చేయటం అతను భరించలేకపోతున్నాడేమో అనుకొన్నాను. ''అన్నం తింటారా''? అడిగాను. ''నా ఆకలి గురించి అంత గుర్తుందా''! అన్నాడు. చివరకు పక్క మీద వాలిపోయాడు ఓ ముద్ద తినకుండానే.

కోరం రాజబాబు



తెల్లారింది. అలాంటి రాత్రుల్ని దాటుకుని ఎన్నో రోజులు నడిచి వెళ్లిపోయాయి. చూస్తూ ఉంటే, నా జీవితం మాత్రం అక్కడే ఆగిపోయింది. నా ఆడతనం వెక్కిరించాక కానీ నాకు అర్థం కాలేదు... అమ్మ కాకపోతే ఆడతనం ఒట్టి మైనపు ముద్ద అని. నేను ఎప్పటికీ అమ్మను కాలేనని తెలిశాక అతను నన్ను ఆడదానిలా చూడటం మానేశాడు. నేను ఓ మనిషినన్న సంగతే మర్చిపోయాడు. మారిపోయాడు. పూర్తిగా భర్త పాత్రను వదిలేశాడు.

ఓ రోజు... నా గుండె లోతుల్ని తడిమి తడిమి మరీ గాయం చేసిన రోజు... దగ్గరగా వచ్చి ''భానూ... నువ్వెలాగూ తల్లివి కాలేవు. అందుకు నిన్ను రీప్లేస్ చేద్దామనుకుంటున్నాను. ఏమంటావ్!'' అన్నాడు. మూడేళ్ల వైవాహిక జీవితం అంత తొందరగా చరమాంక దశకు వచ్చేస్తుందని నేనెప్పుడూ ఊహించలేదు. ఇలాంటి రోజు వస్తుందని నాకు తెలుసు. కాస్త తొందరగా వచ్చింది అంతే!

చివరకు నా మౌనాన్ని కూడా అతను భరించే స్థితిలో లేడని తెలిసి ''మీ ఇష్టం'' అన్నాను. అతని ముఖంలో నవ్వు విరిసింది. -నేను తొలి రోజుల్లో అప్పుడప్పుడూ చూసిన నవ్వది.

ఆ తర్వాత అత నింట్లో నేను ఒంటరిదాన్నైపోయాను. మనసుకు ఎప్పుడన్నా గాయమైతే ఏడుపొస్తుంది. ప్రతీ రోజూ గాయమైతే గుండె బరువెక్కుతుంది. ఆ తర్వాత నెమ్మదిగా బరువు దిగిపోతుంది. క్రమంగా అలవాటైపోతుంది. అలా అలవాటైన జీవితం నుండి కొత్త జీవితం కావాలనిపించింది. నా చదువు అందుకు ధైర్యాన్ని అందించింది. ప్రయత్నించగా ఓ కార్పొరేటు బ్యాంకులో జాబ్ దొరికింది. అక్కడే పరిచయమయ్యాడు మణి. ఓ స్నేహితునిగా నాలో చాలా మర్పు తీసుకొచ్చాడు. అంతవరకు మనం ఎటు నడిస్తే అటే సమాజం కూడా నడుస్తుందన్న భ్రమలోంచి నన్ను బయటకు లాగాడు. సమాజం ఎప్పుడూ ఒకేలా ఉంటుందని, మన ఆలోచనలే ఎగుడుదిగుడుగా ఉంటాయని, సరైన దారులు వెతుక్కోవటంలోనే వివేకం ఉందని చెప్పేవాడు.

అతని మాటలు నన్ను ఆకర్షించాయి. అతని స్నేహం కొత్త బలాన్నిచ్చింది. నేనేం కోల్పోయానో నాకు తెలుసు. ఆ ఫీలింగ్ నుండి బయటకు రావటం కష్టమనీ తెలుసు.

అయినా తప్పుని పోరాటం. ఇంకా చేస్తూనే ఉన్నాను. మణి సాయంతో ఇప్పుడిప్పుడే సమాజాన్ని అర్థం చేసుకుంటున్నాను.

స్టవ్ మీద పెట్టిన కుక్కర్ విజిల్‌తో నా ఆలోచనలు ఠక్కున ఆగిపోయాయి. మనసు బరువెక్కిపోయింది. ఆఫీసుకు వెళ్లాలనిపించలేదు. అదే విషయాన్ని మణికి ఫోన్ చేసి చెప్పాను. అతను ఈవెనింగ్ వస్తానని చెప్పాడు. నా ఆలోచనలు ఆగిపోయినా ఇంకా నా మనసు నా స్వాధీనంలోకి రాకపోయేసరికి బెడ్ మీద వాలిపోయాను.

★ ★ ★

మణి ఆ రోజు సాయంత్రం వచ్చాడు. ఎందుకో ముభావంగా కనిపించాడు. ఆ మాటే అడిగాను. అతను చిన్నగా నవ్వి ఊరుకున్నాడు. ఎప్పుడూ సరదాగా ఉండే మణి ఎందుకలా ఉన్నాడో నాకర్థం కాలేదు. అతను చెప్పే వరకూ మరోసారి అడగకూడదని అనుకుంటూనే అతని ఫీలింగ్స్‌ను గమనించటానికి ప్రయత్నించాను. కాఫీ ఇచ్చాను. అతను ఇష్టంగా తాగే కాఫీ పట్ల ఆసక్తి చూపలేదు. సడన్‌గా లేచి వెళ్తున్నానన్నాడు. వెళ్తూ నాకు జాగ్రత్తలు చెప్పాడు. ఏదీ అర్థం కాని మూడ్‌లో పడిపోయాను నేను.

★ ★ ★

ఆఫీసులో మణి కోసం ఎదురుచూశాను. ఒక్కరోజు కాదు.. వారం రోజులుపైగా! ఏదో పర్సనల్ ప్రాబ్లమ్ అంటూ లీవ్ లెటర్ పంపించాడని తెలిసింది నాకు. నాతో చెప్పకూడని ప్రాబ్లమ్ ఏముంటుంది? అతని ప్రవర్తన నా ఆలోచనలకు అందలేదు. లీవ్ పూర్తయ్యాక వస్తాడనుకుంటే ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడన్న వార్త చెప్పారు ఆఫీసు వాళ్లు. నాకు తల తిరిగిపోయింది. కాసేపు ఊపిరందలేదు. ఉద్వేగం ఒళ్లంతా పాకింది. నా సీటులో అలాగే కూలబడిపోయాను.

మరో వారం రోజులు గడిచిపోయాయి. మణి మద్రాస్ బ్రాంచ్‌కి వెళ్లిపోయాడని ఆఫీసులో తెలిసినప్పటి నుండి అతని కోసం ట్రై చేస్తూనే ఉన్నాను.


అతను నాకు దొరకలేదు.

మరో రెండు రోజులు తర్వాత ఆఫీసుకు నాకో లెటర్ వచ్చింది. కవరుపై అడ్రస్ మణి రాసిందే. అతని చేతి రాత నాకు బాగా తెలుసు. ఆతృతగా కవర్ విప్పాను. నా కళ్ళు అక్షరాల వెంట పరుగెట్టాయి.

''డియర్ భాను...!

ముందుగా నన్ను క్షమించు. నీకు చెప్పకుండా పిరికివాడిలా వెళ్ళిపోయినందుకు నాకే సిగ్గుగా ఉంది. నేనెందుకలా చేశానో నీకు చెప్పాల్సిన బాధ్యత ఉంది భాను. నువ్వు నా బెస్ట్ ఫ్రెండ్‌వి. నీకూ నేనంతే! మనం స్నేహితులుగా ఉంటూ ఏం తప్పు చేశామో తెలుసా? మన చుట్టూ ఉన్న వ్యక్తుల్ని గమనించక పోవడమే మనం చేసిన తప్పు. ఆఫీసులో మనిద్దరి గురించి తప్పుగా మాట్లాడుకుంటున్నారని చాలా ఆలస్యంగా తెలిసింది నాకు. అది భరించటం నా వల్ల కాలేదు. ఈమధ్య మా ఇంట్లో కూడా ఒకటే గొడవ. నీ వరకూ రాకూడదనే అనుకున్నాను. నిజానికి నేనెక్కడ ఉన్నదీ నీకు తెలియకూడదనుకున్నాను కూడా!

మనది పిచ్చి స్నేహం భాను. ఎవరో ఏదో అనుకుంటారని ఎప్పుడూ ఆలోచించలేదు. పిచ్చి... ప్రేమకే కాదు స్నేహానికీ ఉంటుందని అర్థమయ్యింది నాకు. నువ్వు ఓ కొత్త జీవితాన్ని కోరుకుంటున్నావ్! సమాజంతో కలిసిపోయి చక్కని అనుబంధాలను ఇప్పుడిప్పుడే వెతుకుతున్నావ్! నీ ప్రయత్నానికి నేను సాయపడ్డానంతే! నీ గతాన్ని గుర్తు చేయకుండా నీ గమ్యాన్ని నీకు సూచించటం తప్ప నేను నీకు సాయపడిందీ తక్కువే.




కానీ... మనల్ని అనుమానించారు. మన స్నేహాన్ని అపహాస్యం చేశారు. వాళ్ళు అనుకుంటున్నవన్నీ నీ వరకూ రావడం నాకిష్టం లేదు. రేపో మాపో నీ వరకూ రావచ్చు. అప్పుడు నేనుండకపోవడమూ మంచిదేగా! అందుకే మా సొంత రాష్ట్రానికి వచ్చేశాను. నేను లేకపోవటం వల్ల అనేవాళ్ళు మానేస్తారని కాదు. మరికొన్ని రోజులకైనా మానేస్తారన్న నమ్మకం.

నీకు చెప్పేవాణ్ని గుర్తుందా! నీ వయస్సు దాటి ఎప్పుడూ ముందుకే వెళ్ళు అని. కాని... ముందు చూపుతో వెళ్ళు అన్ని చెప్పాలనిపిస్తోంది భానూ. నేనూ మగాడ్ని అయినందుకు సిగ్గుతో తలొంచుకుంటున్నాను. మన స్నేహం ఓ చిన్నప్రయాణం అనుకో. గుర్తుండిపోయే ఎన్నో అనుభూతులు దొరుకుతాయి. భానూ... అన్నిటికన్నా జీవితం గొప్పది. వ్యక్తుల్ని ద్వేషించకు. గతాన్ని కూడా ద్వేషించకు.

మరో మాట...! నీ స్నేహంలో గొప్ప అనుబంధాన్ని చూశాను. మాధుర్యాన్ని అనుభవించాను. నీ మనసుకు బాధ కలగకూడదనే నేను వెళ్ళిపోయాను. ఈ పెయిన్‌ను నువ్వు జయించాలని కోరుకుంటున్న నీ మిత్రుడు...!

-మణి''



లెటర్ చదివాక ఈ పెయిన్ నేనూ అనుభవిస్తూనే ఉన్నాను అంటూ గట్టిగా అరిచి మణికి చెప్పాలనిపించింది. మా ఇద్దరి గురించి ఏమనుకుంటున్నారో నాకూ తెలుసు. నేను బయటపడలేదంతే! మణి మాత్రం సగటు మగాడిగానే ఆలోచించాడు. తప్పుచేసిన వాడిలా వెళ్ళిపోయాడు. నిందలన్నీ నన్నే మోయమంటూ జారుకున్నాడు. ఒకరకంగా నన్ను, నా ఆత్మాభిమానాన్ని చంపేశాడు. ఒక మంచి స్నేహితుడు దొరికాడంటూ గర్వపడేదాన్ని. ఇప్పుడా స్నేహం ఎక్కడుంది? ఆలోచిస్తుంటే గుండె బరువెక్కిపోయింది. భరించలేనంత వేదన నన్ను కమ్మేసింది. మధ్యలోనే అదృశ్యమైపోయిన స్నేహ మాధుర్యం ఇప్పుడు నన్ను వెక్కిరిస్తోంది. ఎన్నెన్ని మంచి మాటలు చెప్పాడు! ఎంత గొప్పగా ప్రవర్తించాడు! అతనేనా అలా చేసింది? ఏడుపు సర్రున దూసుకొచ్చింది.

మనిషి ప్రవర్తన వల్ల వ్యవస్థ చెడిపోతుంది. తప్పు వ్యవస్థది కాదు. మనిషి తన గురించి కాకుండా ఇతరుల గురించి ఆలోచించటం ఎప్పుడు మానేస్తాడో? నా ఆలోచన పట్ల నాలో ఓ వెర్రి నవ్వు.

నాకెందుకో మణిని ద్వేషించాలనిపించలేదు. అతడు ఈ వ్యవస్థకి లొంగిపోయాడంతే! అతను వెళ్ళిపోయినా అతను అందించిన ఇన్‌స్పిరేషన్ చాలా గొప్పది. మనసు కుదుటపడే కొద్దీ గుండెలో బాధ తగ్గినట్లనిపించింది. హాయిగా నవ్వటం మానేసి ఎన్ని రోజులైందంటూ నా అంతరాత్మ నన్ను సూటిగా ప్రశ్నిస్తుంటే... నా ఆత్మస్థైర్యం వెనుక దాగిన ఓ చిర్నవ్వు అలా వచ్చి నా పెదాల్ని ముద్దాడి వెళ్ళిపోయింది నాలో మరింత ధైర్యాన్ని నింపుతూ...!

## అలవాటు

**ప్రతి తారకి కొన్ని అలవాట్లు ఉంటాయి. అంటే అమలాపురం అంటూ అందర్నీ అలరించిన అభినయశ్రీ ఇప్పుడు తెలుగులో బిజీగా ఉంది. 'నేను సైతం...' అంటూ జనం ముందుకి రాబోతోంది. 'సినీరంగంలో కొచ్చాక ఇక్కడి వాతావరణం కొత్తగా అన్పించినా మన కర్తవ్యం ఏమిటో కొంతకాలానికి గానీ బోధపడదు. అనాథల్ని ఆదుకోవడం అంటే నాకిష్టం. అందుకే నా పుట్టినరోజులు, నాకు సంతోషకరమైన రోజుల్ని వారిమధ్య గడుపుతున్నాను. నా వంతు సాయం చేస్తున్నా' అంటోంది అభినయశ్రీ.**